# 13

# తొలి ఆపద

మధ్యవర్తి నారాయణ ఆ సంబంధం ఎలాగైనా కుదుర్చాలని చాలా పట్టుదలగా ఉన్నాడు. వరుడు అమెరికాలో ఉన్నాడు. ప్రస్తుతం అక్కడున్నాడుగానీ అక్కడ స్థిరపడే ఆలోచన లేదు. కానీ ఇంకా రెండేళ్ళు ఉండాలి. పెళ్ళీడు వచ్చింది కాబట్టి పెళ్ళి చేసేస్తే మంచిదని తల్లిదండ్రులు తొందరపడుతున్నారు. పెళ్ళికొడుకు కూడా 'త్వరగా భార్య వచ్చేస్తే తోడూ నీడగా ఉంటుంది. ఇంత వండి పెడుతుంది. ఆ దేశంలో చెట్టాపట్టాలేసుకుని హనీమూన్‌లా గడిపేసి ఆ తర్వాత ఇండియా వెళ్ళి పిల్లా పీచూ విషయం ఆలోచించాలి' అని తొందరపడుతున్నాడు. పెళ్ళికొడుకు పేరు సాయి చైతన్య.

పెళ్ళికూతురి పేరు బాల శరణ్య. చిన్నతనంలోనే తల్లిపోతే అమ్మమ్మ దగ్గరే పెరిగింది. డిగ్రీ పాసయింది. 'అమెరికాలో శాశ్వతంగా ఉండేమాటైతే ఇవ్వంగానీ ఓ రెండేళ్ళుండి వచ్చేస్తామంటున్నారు కాబట్టి సరే' అన్నారు పిల్ల తాతగారు. అన్నింటినీమించి ఇద్దరికీ స్వల్పంగా కుజదోషం ఉంది కాబట్టి జాతకాలు దివ్యంగా కలిశాయి.

పెళ్ళికొడుకు ఒక నెల్రోజులు సెలవుమీద వస్తే పెళ్ళిచూపులు చూసుకుని పెళ్ళిచేసుకుని భార్యని వెంటబెట్టుకుని వెళ్ళిపోవచ్చు అనుకున్నారు. పెద్దలు ఒకటి తలిస్తే కుర్రాడి బాస్ మరొకటి తలిచాడు. 'ఇప్పుడు సెలవు ఇవ్వను, కావాలంటే మరో రెండు నెలలు ఆగి వెళ్ళు' అన్నాడు. ఆ అమెరికావాళ్ళకా పట్టింపులేం లేవుగానీ ఇక్కడ పరిస్థితి కాస్త క్లిష్టంగానే ఉంది. ముందంతా మూఢాలూ ఆ తర్వాత శూన్యమాసం. పెళ్ళికొడుకు తిరిగ్గావచ్చి పెళ్ళిచూపులు చూసుకుని ఆ తర్వాత ముహూర్తాలు పెట్టుకోవాలీ పెళ్ళి చెయ్యాలీ అంటే కంగారైపోతుంది. పెళ్ళి

హైదరాబాద్‌లోనే అయితే ఏదో ఓ మంటపం ముందుగా బుక్ చేసుకుని ఉంచుకోవచ్చు.

కానీ పిల్ల తాతగారు మాత్రం అందుకు ఒప్పుకోవటంలేదు. 'ఆ హడావిడి పెళ్ళీ చిప్పభోజనాలూ నాకొద్దు. నాకు గారాల మనవరాలు. దాని వివాహం నా ఇంటిముందర జరగాల్సిందే' అన్నాడు. ఇన్ని మడతపేచీలు ఉన్నాయి కాబట్టి ఇరువైపులవారూ చర్చించి, పెళ్ళిచూపులు కంప్యూటర్లో జరిపించాలని నిర్ణయానికి వచ్చారు. చాలా మందికి అసలా గొడవేమిటో అర్థంకాలేదు. అర్థం అయ్యాక 'అదేమిటి, అలా ఎలా వీలవుతుంది? అబ్బాయిని కళ్ళారా చూడకుండా అతనెలాంటి వాడో తెలియకుండా పిల్లనెలా ఇస్తాం అన్నారు' కంప్యూటర్ జ్ఞానం అంతగా లేని పెద్దవాళ్ళు. 'ఏం ఫర్వాలేదు. కంప్యూటరైనా కళ్ళముదే ఉంటుంది. అబ్బాయిని చూడొచ్చు. అడగాల్సినవి అన్నీ అడగవచ్చు' అని నచ్చజెప్పారు కంప్యూటర్ గురించి క్షుణ్ణంగా తెలిసిన చిన్నవాళ్ళు.

ఒక శుభముహూర్తాన పెళ్ళిచూపులు ఏర్పాటు చేశారు. శనివారం సాయంత్రం ఏడుగంటలకి. 'దీపాలు పెట్టాక పెళ్ళిచూపులేమిటని' సణిగింది పెళ్ళికూతురి అమ్మమ్మ. 'ఇక్కడ చీకటి పడినా అక్కడ పగలు పదిగంటలు. అమెరికా సంబంధం అన్న తరవాత ఆ మాత్రం సర్దుబాటు చేసుకోవాలి మరి' అన్నాడు పిల్లతండ్రి.

మొత్తానికి పెళ్ళికొడుకు సాయిచైతన్య కంప్యూటర్ తెరమీద ప్రత్యక్షం అయ్యాడు. ముందు పెద్దవాళ్ళు చూసి, నచ్చితే అమ్మాయిని కంప్యూటర్ ముందుకు తీసుకొద్దాం అని ముందే అనుకోవడం వల్ల ఇటువైపు కెమెరా ముందు పిల్ల తాతగారే కూర్చున్నారు. ఆ తర్వాత తండ్రి, చిన్న మేనమామ, పెత్తండ్రి కొడుకు అంతా వరుసక్రమంలో కెమెరా ముందు కూర్చొని మంచీ చెడ్డా మాట్లాడి అతగాడి వివరాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత ఆడంగులు కూడా ఎదురుగా కూర్చోకపోయినా తొంగిచూసి పిల్లవాడు బాగున్నాడు అనుకున్నారు. మగవాళ్ళు అతని పద్ధతి చూసి సంతృప్తి పడ్డారు.

ఇక అమ్మాయిని చూపిద్దాం అనుకుంటూ ఉండగా కరెంటు పోయింది. ఆ పోవటం పోవటం రెండు గంటల తర్వాత వచ్చింది. అప్పటికి రాత్రి పది గంటలు అవుతోంది. శరణ్య తొమ్మిది దాటితే నిద్రకి ఆగలేదు. కానీ మధ్యలో ఆగిపోయిన పెళ్ళిచూపులను పునరుద్ధరించాలి కాబట్టి పెళ్ళికూతురి మేనమామ, పెళ్ళికొడుక్కి ఫోన్ చేశాడు. 'కరెంటొచ్చింది, మీరొస్తారా?' అన్నాడు.

అవతల సాయిచైతన్య కాస్త ఇరకాటంలో పడ్డాడు. అతను పన్నెండు దాటితే ఆకలికి ఆగలేడు. అందులోనూ ఇంట్లో ఏమీ లేవు. అన్నీ అయిపోయాయి. బయటికెళ్ళి ఏమైనా తిని వారానికి సరిపడా షాపింగ్ చేసుకురావాలి. వెళ్దామా అనుకుంటూ వుండగా ఫోన్. కాదంటే బావుండదేమో అనిపించింది. సరే అన్నాడు.

అటు చైతన్యా ఇటు శరణ్యా కెమెరాల ముందు కూర్చున్నారు. చూసీ చూడగానే చైతన్య గుండె ఝల్లుమంది. ఆల్చిప్పల్లాంటి కళ్ళు వాల్చుకుని కూర్చొని ఉంది "హలో నా పేరు చైతన్య" అన్నాడు.

"తెలుసు. నాన్నగారు చెప్పారు" అంటూ కళ్ళెత్తి చూసింది. చక్కగా, ఉన్నాడు కానీ మొహంలో ఏదో దిగులు. బాధని అణుచుకుంటున్నట్టుగా ఉన్నాడు. నవ్వు లేనేలేదు. పెళ్ళిచూపుల్లో పెళ్ళికొడుకు మరీ అంత బాధగా ఉండటం కొద్దిగా అసహజంగానే అనిపించింది శరణ్యకి. అవును మరి, ఆకలి బాధకు మించిన బాధ ఏముంటుంది? ఆ విషయం గురించి ప్రస్తావిద్దాం అనుకుంటూ ఉండగానే ఆవలింతలు వచ్చేశాయి.

"మీకు నిద్రొస్తున్నట్లుగా ఉంది" అన్నాడు.

"అవునండీ, తొమ్మిది దాటితే నిద్రకి ఆగలేను. మనం రేపు మాట్లాడు కుందామా?" అంది ఆవలింత ఆపుకుంటూ.

'రక్షించావు తల్లీ. లేకపోతే నేను ఆకలికి ఆగలేను అని నేనే చెప్పేయాల్సి వచ్చేది' అనుకున్నాడు. "అలాగే రేప్పొద్దున మాట్లాడుకుందాం" అన్నాడు.

మర్నాడు ఇండియాలో పొద్దున తొమ్మిది. అమెరికాలో రాత్రి పదిన్నర దాటింది. మళ్ళీ కంప్యూటర్ కెమెరాలముందు కూర్చున్నారిద్దరూ. 'ఏ దివిలో విరిసిన పారిజాతమో' అని మనసారా పాడాలనిపించింది చైతన్యకు. పగలంతా ఇల్లు శుభ్రం చేసుకోవటం, బట్టలు ఇస్త్రీ చేసుకోవడం వగైరా పనులతో అలసిపోయి ఉన్నాడు చైతన్య . కానీ మొహంలో సంతోషం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. అలసటగా, ఆనందంగా, జుట్టురేగిపోయిన ఆ పెళ్ళికొడుకు ఎంతో నచ్చాడు శరణ్యకి. 'ఇతగాడితో అమెరికా ఏం ఖర్మ, అంటార్కిటికాకి వెళ్ళమన్నా వెళ్ళొచ్చు' అనుకుంది. ఆకలీ నిద్రా వంటి ఈతిబాధలు లేకపోవడంతో తనివితీరా మాట్లాడుకున్నారిద్దరూ.

అలా చాలాసేపు మాట్లాడుకున్నాక కిందటిరోజు సమస్య తలకిందులు అయింది. సాయిచైతన్యకు ఆవలింతలూ, బాలశరణ్యకు ఆకలి. మళ్ళీ కలుసుకుందాం అనుకుని కెమేరాల ముందునుంచి కదిలారు. అబ్బాయీ అమ్మాయీ ఇష్టపడ్డారు కాబట్టి ముహూర్తాలు పెట్టేశారు. 'అందాకా మనిద్దరం రోజూ ఓ గంటసేపు మాట్లాడుకుందాం' అనుకున్నారు కాబోయే దంపతులు.

కానీ అలా చేయడానికి అవకాశం కుదర్లేదు. కరెంటు సమస్య, నిద్ర సమస్య, ఆకలి సమస్య. ఈ పగలూ రాత్రీ వ్యత్యాసం చాలా తలనొప్పిగా తయారైంది. 'ఛ, ఈ దేవుడు భూమిని గుండ్రంగా సృష్టించి పొరపాటు చేశాడు. చక్కగా బల్లపరుపుగా ఉండుంటే ఈ రాత్రీపగలూ గొడవలుండేవి కావు. కాబోయే భార్యను కరవుతీరా చూసుకుంటూ కబుర్లు చెప్పుకునే అవకాశం కూడా కరవైపోతోంది' అనుకున్నాడు చైతన్య దిగులుగా.

అతనా విషయం ఆలోచించి దిగులుగా ఉన్నాడుగానీ ఇక్కడ శరణ్య మనసంతా అల్లకల్లోలంగా ఉంది. పెళ్ళయి భర్త దగ్గరికి వెళ్ళాలనే సంతోషం ఒకవైపు, అయినవా రందరినీ వదిలివెళ్ళాలనే బాధ మరోవైపు. అందులోనూ అంతదూరం వెళ్ళిపోతుంది కాబట్టి అందరూ మా దగ్గర నాలుగు రోజులుండి వెళ్దువుగాని అని ఆ తల్లిలేని పిల్లను తీసుకెళ్ళడంతో తీరికలేకుండా ఉంది.

ఆ తర్వాత ఇంటికి సున్నాలు కొట్టించడంతో పెళ్ళిపనులు ప్రారంభం అయ్యాయి. బజారు పనులు, వంటవారినీ మేళగాళ్ళనూ మాట్లాడటం... అంతా హడావిడిగా ఉంది. మనవరాలిని పల్లకీలో ఊరేగించాలని అమ్మమ్మ సరదాపడింది. ఆ ఊళ్ళో ఇంకా ఓ పల్లకీ ఉంది. దానికి చిన్నా చితకా మరమ్మత్తులు చేసి సిద్ధం చేశారు.

ఈ సందడిలో వాళ్ళిద్దరూ నాలుగైదుసార్లు మాత్రమే కంప్యూటర్లో మాట్లాడు కోవడం సాధ్యపడింది. రోజూ ఫోన్‌లో మాట్లాడుకుంటూనే ఉన్నారు. "వచ్చేవారం నేను హైదరాబాద్ వచ్చేస్తున్నాను. ఆ సమయానికి నువ్వూ ఏదో పని కల్పించుకుని అక్కడి కొచ్చేస్తే మనిద్దరం ఎయిర్‌పోర్ట్‌లో కలుసుకుందాం. అక్కడినుంచి విజయవాడ వెళ్దాం. ఆ తర్వాత నేనొచ్చి నిన్ను మీ ఊళ్ళో దిగబెట్టి వస్తాను" అన్నాడు చైతన్య. అడిగి చెప్తానంది శరణ్య.

అంతా విని 'ఠఠ్ వల్లకాదు' అన్నారు శరణ్య వైపు పెద్దవాళ్ళు. 'పెళ్ళిచూపుల్లో చూడ్డం అంటే వేరే విషయం. పెళ్ళికిముందే అలా ఊళ్ళు పట్టుకు తిరగడం మన పద్ధతికాదు' అనేశారు.

ఆ మాట విని కాస్త చిన్నబుచ్చుకున్నాడు చైతన్య. 'నేనేం అంత రౌడీవెధవలా కనిపిస్తున్నానా? అంత నమ్మకం లేదా?' అని ఆవేశపడితే తల్లి సర్దిచెప్పింది. "నమ్మకం లేక కాదు. కొన్ని పద్ధతులూ నియమాలూ ఉంటాయి కదా" అంది.

"సరే, మరి నేను శరణ్యని ఎప్పుడు చూడాలి?" అని అడిగాడు.

"చూద్దాంలే" అంది తల్లి.

హైదరాబాద్ వచ్చేశాడు. అప్పటికి పెళ్ళి ఆరు రోజులుంది. ముహూర్తం రాత్రి ఎనిమిది గంటలకి. తెల్లవారుజామునే బయలుదేరి పెళ్ళివారింటికి వెళ్ళాలి. నాలుగురోజులు షాపింగులని ఊదరపెట్టేశారు. ఆ మర్నాడు పెళ్ళికొడుకుని చేశారు. అన్నీ సర్దుకుని ఆ తెల్లవారు జామున అయిదింటికి బయలుదేరారు పెళ్ళివారు. ఒక బస్సు, నాలుగైదు కార్లు.

ఊరిబయటికే వచ్చి ఎదురుకోలు పలికారు ఆడపెళ్ళివారు. బ్యాండువాళ్ళు దద్దరిల్లిపోయేలా వాయించారు. పెళ్ళికొడుకుని కారు దింపి పల్లకీ ఎక్కమన్నారు.

"నేనెక్కను. నాకలవాటు లేదు" అన్నాడు తల్లితో.

"ఛ, అలా అనకూడదు. వాళ్ళెంతో సరదాపడి తీసుకొచ్చారు. వద్దంటే బాధపడతారు" అంది తల్లి.

"కళ్ళు తిరగవా?" అన్నాడు భయంగా.

"ఏం తిరగవు. అయినా జెయింట్‌వీల్, రోలర్ కోస్టర్ ఎక్కేవారికి ఇదో లెక్కా, ఎక్కు ఎక్కు" అని కంగారుపెట్టి పల్లకీ ఎక్కించేసింది.

బోయీలు పల్లకీ భుజాలకెత్తుకున్నారు. కెవ్వుమనబోయి బలవంతాన ఆపుకున్నాడు చైతన్య. ఊరేగింపు బయలుదేరింది. ముందు ఆడపెళ్ళివారు, వారి కంటే ముందు బ్యాండ్ పార్టీ. వాళ్ళు వాయించే పాటలు ముసలివాళ్ళకు కూడా హుషారెక్కించేలా ఉన్నాయి. ఇక ఆ బోయీల సంగతి చెప్పాలా? సంగీతానికి అనుగుణంగా అడుగులు వేస్తూ ఉంటే పెళ్ళికొడుకు పై ప్రాణాలు పైనే పోయాయి.

విడిదిముందు ఆగాక అప్పుడు ఊపిరి పీల్చుకున్నాడు. పెళ్ళివారిల్లూ విడిదీ ఒకే వీధిలో ఉన్నాయి. మధ్యలో నాలుగైదు ఇళ్ళున్నాయి. పెళ్ళింటిముందూ విడిదింటిముందూ కూడా తాటాకు పందిళ్ళు వేశారు వియ్యాలవారు. అడుగులకు మడుగులు వత్తుతూ మర్యాదలు చేస్తుంటే మగపెళ్ళివారి ఆనందం వర్ణనాతీతం. కేటరింగ్‌వారి మొక్కుబడి పలుకరింపులతో విసిగిపోయి ఉన్న జనానికి ఈ వాతావరణం తొలకరిజల్లులా ఉంది. 'అక్కడ రిసెప్షన్ ఎలాగూ ఉంది కదా అని బద్ధకించకుండా పెళ్ళికొచ్చి మంచిపనే చేశాం' అనుకున్నారు.

కాఫీలయ్యాక పెళ్ళికొడుకుని స్నానానికి తీసుకెళ్ళారు. జమాజెట్టీల్లాంటి ఇద్దరు మనుషులు నూనె పెట్టి, తల చక్కగా అంటి, ఒళ్ళుపట్టి, నాలుగు గంగాళాల వేడినీళ్ళు స్నానం చేయించేసరికి చైతన్య ప్రాణం ఎటోపోయింది. 'అబ్బ! స్వర్గం అంటే ఇదే' అనుకున్నాడు.

తల తుడిచి పట్టుబట్టలు కట్టించి స్నాతకం పీటలమీద కూర్చోబెట్టారు. అక్కడే తిరుగుతున్న బాబాయి కూతుర్ని పిలిచి "ఆడపడుచుని అంటూ లాంఛనాలు ఎగరేసుకుపోవడం కాదు. మీ వదినను నాకు చూపించే ఏర్పాటు చెయ్" అన్నాడు.

"అలాగేలే" అంది ఆ అమ్మాయి నవ్వుతూ. వెంటనే రంగంలోకి దిగి ఆడపెళ్ళివారి వైపు తన హోదాలో ఉన్న ఒక అమ్మాయిని పరిచయం చేసుకుని విషయం బైట పెట్టింది. ఆ అమ్మాయి మొహం వెలిగిపోయింది. "అక్కడా ఇదే గొడవ. నేనూ ఆ ప్రయత్నంలోనే ఉన్నాను" అంది. ఇద్దరూ కలిసి రంగం సిద్ధం చేశారు.

స్నాతకం కార్యక్రమం ప్రారంభం అయింది. జెట్‌లాగ్ నుంచి కోలుకోని చైతన్యకు వేడి వేడి నీళ్ళతో స్నానం తోడై ఒకటే నిద్ర, కళ్ళు మూతలేసుకుపోవటం. అప్పటికీ అరడజను సార్లు వేడి వేడిగా కాఫీ తాగినా లాభంలేకపోయింది. అటు అమ్మమీదికీ ఇటు నాన్నమీదికీ వాలిపోవటం. అది చూసి బంధువులు కొంత మంది చెవులు కొరుక్కున్నారు. 'పట్టపగలే అలా తూలిపోతున్నాడేం? ఏమో, ఈ కాలం పిల్లలకి ఏదీ తప్పుకాదు. అన్ని అలవాట్లూ ఫ్యాషనైపోయాయి' అనుకున్నారు. మగపెళ్ళివారు మాత్రం 'మరీ అక్కడినుంచి రాగానే ముహూర్తం అయిపోయింది. కాస్త పదిరోజులైనా వ్యవధి ఉంటే ఈ జెట్‌లాగ్ తగ్గేది' అన్నారు.

అక్కడ పెళ్ళికూతురింట్లోనూ కార్యక్రమం ప్రారంభం అయింది. ముందురోజే పెళ్ళికూతుర్ని చేసేశారు. ఆ వేళ అంకురార్పరణ. మామూలు సమయాల్లో అంతగా పట్టించుకోకపోయినా ఇటువంటి సందర్భాల్లో తల్లిలేని లోటు తప్పకుండా గుర్తొస్తుంది. అమ్మమ్మ మనవరాల్ని కావలించుకుని పోయిన కూతుర్ని తల్చుకుని ఒకటే ఏడుపు. అది చూసి పెళ్ళికూతురు ఏడుపు. వాళ్లని చూసి మిగిలినవాళ్ళు.

మొత్తానికి ఎలాగైతేనేం ఇటు స్నాతకం, అటు అంకురార్పణ ముగిశాయి. అప్పుడు అటు పెళ్ళికూతురి చెవిలోనూ ఇటు పెళ్ళికొడుకు చెవిలోనూ గుసగుసలాడారు అమ్మాయిలు. పెళ్ళివారింటికీ విడిదింటికీ మధ్యలో ఉన్న మరో ఇంట్లోకి ఎవరికంటా పడకుండా చేర్చారు.

ముందు శరణ్యే వచ్చింది. తర్వాత చైతన్య. "అన్నయ్యా, ఏం మాట్లాడతావో త్వరగా మాట్లాడెయ్. మళ్ళీ పెద్దవాళ్ళు చూస్తే నాకు చీవాట్లు తప్పవు" అని హెచ్చరించింది ఆడపడుచు.

'సర్లే' అంటూ గదిలోకి ఆత్రంగా అడుగు పెట్టిన చైతన్య ఎదురుగా ఉన్న వ్యక్తిని చూసి నిర్ఘాంతపోయాడు. పెద్దంచు పట్టుచీర, ఒళ్ళంతా దిగేసిన నగలు, జుట్టు రేగిపోయి కాటుక కిందదాకా పాకిపోయి చంద్రముఖి సినిమాలో 'రారా' అనే పాటలో జ్యోతికని తలపించేలా ఉంది. 'ఈవిడా నేను కంప్యూటర్లో చూసిన అమ్మాయి' అనుకున్నాడు అయోమయంగా.

అటు శరణ్య పరిస్థితీ అలాగే ఉంది. కుంకుడు రసంతో తలంటి పొయ్యడంవల్ల జుట్టంతా లేచి నిలబడింది. ఆడపిల్లలాగా కాటుకపెట్టిన చింతనిప్పుల్లాంటి కళ్ళు, జారిపోతున్న ఉత్తరీయం. ఆరు హత్యలు చేసి పారిపోయి వస్తున్న వాడిలా ఉంది అతని వాలకం. 'ఆ కంప్యూటరు ఎంత మోసం చేసింది' అనుకుంది. ఎవరికివారే నిరాశానిస్పృహలకు లోనయ్యారు. అటువంటి పరిస్థితిలో ఎవరికీ ఏమీ మాట్లాడా లనిపించలేదు. 'ఇంతే మాకు ప్రాప్తం' అనుకున్నారు ఎవరికివారు.

బరువెక్కిన మనసుతో వెళ్ళి ఏదో తిని నిద్రకుపడ్డాడు చైతన్య. శరణ్యకు నిద్ర రాలేదు కానీ 'కళ్ళు మూసుకుని పడుకో, మళ్ళీ రాత్రికి నిద్ర ఉండదు' అని పడుకోబెట్టి, కాళ్ళూ చేతులూ పడుతూ సేవ చేసేసరికి చిన్న కునుకు పట్టింది.

'ఆరుగంటలకల్లా రెడీగా ఉండాలి' అని చెప్పి వెళ్ళాడు పురోహితుడు. పెళ్ళికూతురి అలంకరణ కోసం పక్క ఊర్నించి బ్యూటీషియన్ వచ్చింది.

పెళ్ళికొడుకుని తయారుచేసే బాధ్యతను వరసకు వదినా అన్నయ్యలు స్వీకరించారు. పెళ్ళి కార్యక్రమం ప్రారంభం అయింది. ముహూర్తంలో బరువెక్కిన మనసుతోనే బెల్లం జీలకర్రా పెట్టారు. తెరతీయగానే 'చూడు నాయనా' అని పురోహితుడు చెప్తే, 'ఏముంది చూడ్డానికి' అనుకుంటూ తలెత్తిన చైతన్య నోరావలించాడు. ఎవరీ బంగారుబొమ్మ... బంగారురంగు చీరెలో తగుమాత్రం నాజూకైన నగలతో మిలమిల మెరిసిపోతోంది.

'నువ్వూ చూడు' అంటే నిరాసక్తంగా తలెత్తిన శరణ్య కళ్ళు మరింత పెద్దవి అయ్యాయి. తల చక్కగా సెట్‌చేసి దువ్వారు. బాగా నిద్రపోవడంవల్ల అలసట తీరిన కళ్ళు మిలమిల మెరుస్తున్నాయి. హఠాత్తుగా 'గ్రీకువీరుడు... నా రాకుమారుడు' అనే పాట మదిలో మెదిలింది.

ఇక ఇద్దరి ఉత్సాహానికీ అంతులేదు. 'మంటపంలో ఒక్కడే వీడియో వాడుండాలి. కావలిస్తే నా సొంత ఖర్చులతో ఫోటోలూ సీడీలూ తీయించి పంపకం చేస్తాను. హేండీకేమ్‌లూ సెల్‌ఫోన్‌లూ పట్టుకుని మంటపంలోకి జొరబడితే కాళ్ళు విరగ్గొడతాను' అని తాతగారు కచ్చితంగా చెప్పడంవల్ల ఆహూతులంతా ఏ అడ్డూలేకుండా కూర్చొని పెళ్ళిచూసి ఆనందించారు.

సాయిచైతన్య, బాలశరణ్య దంపతులయ్యారు. అగ్ని, అరుంధతీ వారిని ఆశీర్వదించారు. ఆవుపాలతో అమ్మాయిని అప్పగించి "ఇక పాలముంచినా నీటముంచినా నీదే భారం నాయనా!" అన్నాడు కన్యాదాత.

వివాహం పూర్తయ్యేసరికి తెలతెలవారుతోంది. రాత్రంతా నిద్రలు లేవేమో అంతా నిద్రలకు పడ్డారు. మధ్యాహ్నం భోజనాలు అయ్యాక పెళ్ళివారంతా తిరుగుముఖం అయ్యారు. అబ్బాయి, మరో నలుగురైదుగురు బంధువులు మాత్రం ఉండిపోయారు. ఆ రాత్రే వారి తొలిరాత్రి. విడిదికి ఇచ్చిన ఇల్లంతా శుభ్రంగా సర్దించి అక్కడ ఏర్పాటు చేశారు. పందిరిమంచం, అగరొత్తులు, మల్లెపూలు... మామూలు వాళ్ళనే మత్తెక్కించేలా ఉంది. ఇక పెళ్ళికొడుకు సంగతి చెప్పాలా? ఎంతకూ తనవితీరనట్లే ఉంది.

తెల్లవారుజాము మూడుగంటలు అయింది. మామూలుగా తొమ్మిది దాటేసరికే నిద్రలోకి జారిపోయే శరణ్య ఇంకా మెలకువగానే ఉంది. "కాసేపు నిద్రపోతావా?" అని అడిగాడు.

"ఇప్పుడేం నిద్రా... మూడవనే అయింది. నాలుగు దాటేసరికి అమ్మమ్మ వస్తుంది" అంది.

"అమ్మమ్మా, ఆవిడెందుకొస్తుంది? ఆవిడకేం పనిక్కడ?" అతనికి అర్థం కాలేదు.

"ఏమో మరి. అది ఆచారం అట. ఇవాల్టికి మటుకు తెల్లవారుజామునే తలుపులు కొట్టేస్తానే అమ్మలూ అంది" తనకు తెలిసిన విషయం వివరించింది.

బరువుగా నిట్టూర్చాడు. "సర్లే, ఏం చేస్తాం. ఏమైనా, మరీ అర్థంలేని పద్ధతులూ అతి చాదస్తం" అన్నాడు కాస్త చిరాగ్గా.

"మరి పెద్దవాళ్ళ మనసులు కష్టపెట్టడం భావ్యం కాదు కదా".

"అవున్లే, మనింటికి వెళ్ళాక మన ఇష్టారాజ్యం" అన్నాడు.

హఠాత్తుగా ఏదో గుర్తొచ్చింది శరణ్యకి. చివాల్న లేచి కూర్చుంది.

"ఏమిటి, ఏమైంది?" అన్నాడు.

తన సమస్య చెప్పింది. "మీకొచ్చా?" అంది.

"నాకెలా చాతనవుతుంది. నీకు రాదా?"

"రాదు"

"మరి వంటా గింటా అన్నీ చేతనవునని చెప్పావుగా?"

"అవన్నీ వచ్చు. ఇది మాత్రం రాదు".

"ఏయ్ దొంగా, నన్నేడిపించాలని అంటున్నావు. చీర కట్టుకోవడం రాని ఆడవాళ్ళుంటారా?" నవ్వేశాడు.

"నమ్మకపోతే నేనేం చెయ్యను. నాకు నిజంగా రాదు" నిజాయితీ ధ్వనించింది. ఆ కంఠంలో.

అతని మొహంలో నవ్వు ఎగిరిపోయింది. "మరి ఇన్నాళ్ళూ ఎలా మేనేజ్ చేశావు, చీర కట్టుకోవడం రాకుండా?"

"నేనసలు చీరలు కట్టుకోను. డ్రెస్‌లే వేసుకుంటా. ఏదైనా పండగో ఫంక్షనో అయితే అమ్మమ్మ కడుతుంది" చెప్పింది.

"మరింకేం? కాసేపట్లో వస్తుందిగా మీ అమ్మమ్మ, ఆవిడచేతే కట్టించుకో".

"సిగ్గులేదూ అలా మాట్లాడటానికి".

"నాకెందుకు సిగ్గు? ఇన్నేళ్ళొచ్చినా చీర కట్టుకోవటం రానందుకు నువ్వు సిగ్గుపడాలి. నిన్నిలా ఏమీ చాతకాకుండా పెంచినందుకు మీవాళ్ళు సిగ్గుపడాలి".

"చాతకాకుండా ఏం పెంచలేదు. బాగానే పెంచారు. సంగీతం, కూచిపూడీ అన్నీ నేర్పించారు తెలుసా?"

"మరింకేం, త్యాగరాజకీర్తన పాడుతూ కూచిపూడి నాట్యం చెయ్యి".

"ఎందుకలా ఊరికే ఏడిపిస్తారు? పెళ్ళి కుదిరాక నేర్చుకుందాం అనుకున్నాను. అంతలో మీరు ఫోన్లో ఇక్కడ చీరలవీ కట్టుకోకు చాదస్తంగా అన్నారు కదా అని మానేశాను".

"చాల్లే. నేరమంతా నా మీదకే నెడుతున్నావు. అంత చీర కట్టుకోవడం రానిదానివి ఇక్కడికి కూడా డ్రెస్ వేసుకునే రాకపోయావా?"

"ఛ, అలా రాకూడదట. పద్ధతి కాదట. అమ్మమ్మ చెప్పింది"

"మీ అమ్మమ్మని తగలెయ్య! ఆవిడొకతీ నా ప్రాణానికి" విసుగేస్తోంది చైతన్యకి.

"అదిగో మళ్ళీ అన్యాయంగా మా అమ్మమ్మని ఆడిపోసుకుంటే నేనూరుకోను" బెదిరించింది.

"ఊరుకోకపోతే ఉరేసుకో".

"మొదటి రాత్రే ఉరేసుకోమనే భర్త వస్తాడని కల్లోకూడా ఊహించలేదు" అంది.

"చీర కట్టుకోవడం కూడా రాని మొద్దుమొహం నాకు భార్యగా వస్తుందని నేను ఊహించలేదు".

"నేనేం మొద్దు మొహాన్ని కాదు. మిగిలిన పన్లన్నీ వచ్చు. ఇదొక్కటే రాదు. ఎన్నిసార్లు చెప్పాలి".

"సర్లే, అవన్నీ వచ్చు. ఇదొక్కటే రాదు. నన్నిప్పుడేం చేయమంటావు?" తల పట్టుకున్నాడు.

ఏడుపొచ్చేసింది శరణ్యకి. ఏడవటం మొదలు పెట్టింది. జాలేసింది చైతన్యకి.

"సర్లే ఏడవకు. నిజానికి నేనేడవాలి. కానీ ఏడ్చి ఏం ప్రయోజనం? లేచి కాస్త ప్రయత్నించు. నేనూ సాయం చేస్తాను" అన్నాడు.

కళ్ళు తుడుచుకుని లేచింది. "సాయం ఉంటే కట్టుకోగలను" అంది ధీమాగా.

పాము కుబుసంలాంటి తెల్లక్రేప్ చీర జారిజారిపోతోంది. ఎలా కట్టుకోవాలో ఊహ ఉంది. కాబట్టి తంటాలుపడి ఎలాగైతేనేం చీర కట్టేసుకుంది.

ఆ బృహత్కార్యం నిర్వహించి 'హమ్మయ్య' అని నుదుటికిపట్టిన చెమట తుడుచుకున్నాడు. "జీవితంలో ఎదురైన మొదటి ఆపద కలిసికట్టుగా తీర్చేసుకున్నాం" అన్నాడు.

శరణ్యకి భర్తమీద బోలెడంత ప్రేమ ముంచుకొచ్చేసింది. "మా అమ్మమ్మ చెప్పనే చెప్పింది. పెళ్ళైతే నీకు నీ భర్త కొండంత అండగా ఉంటాడే అమ్మలూ అంది" అంటూ అమాంతం అతని దగ్గరకు రాబోయింది.

వెనక్కి గంతేశాడు చైతన్య. "వద్దు తల్లీ, అంత ప్రేమొద్దు. మళ్ళీ చీర ఊడిపోతే కట్టడం నా వల్ల కాదు" అన్నాడు దీనంగా.

"ఏం ఫర్వాలేదు. నాకిప్పుడు ధైర్యం వచ్చేసింది. చీర కట్టుకోవడం వచ్చేసిందిగా" అంటూ అతని మెడచుట్టూ చేతులేసింది.

బయట సందడి వినిపించి అన్నాడు చైతన్య "ఏం లాభం? అక్కడ అమ్మమ్మ వచ్చేసిందిగా".

"మీకు నా మీద కోపం రాలేదు కదా" అంది శరణ్య గారంగా.

"భర్తకి నీలాంటి భార్యమీద కోపం రాదు కదా" అన్నాడు మురిపెంగా.

"అమ్మలూ అమ్మలూ" అంటూ తలుపు తట్టింది అమ్మమ్మ.

ఈనాడు ఆదివారం, 14 ఫిబ్రవరి 2010